క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయాలి

సత్యవేడు: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర నాయకత్వం అధ్యక్షతన ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న మహాసభను విజయవంతం చేయాలని సత్యవేడు తాలూకా సంఘం అధ్యక్షుడు బొప్పన లలిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి విడుదల చేశారు. లీలా మాధవ్‌రావు, శ్యామ్యూల్, వాసు, నవీన్, ఓం ప్రసాద్, రమణమూర్తి పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాల పంపిణీ



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం జరిగిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 70 మంది గర్భిణులకు వైద్యాధికారిణి మాధవి, వైద్యులు దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరికి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ రాకేష్, లేట్ వెంకటేశ్వర్లు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నేతలు జొన్నల గోపాల్‌రెడ్డి, జయచంద్రనాయుడు, గురవయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఆగడాలపై బస్సు యాత్ర

వరదయ్యపాళెం: ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం వరదయ్యపాళెంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

19న పెన్నలపాడు ఉప ఎన్నిక

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పెన్నలపాడులో ఈనెల 19న సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి రాఘవేంద్రరావు తెలిపారు. పెన్నలపాడు సర్పంచ్ పోచినేని విజయలక్ష్మి అకాలమరణంతో ఈ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 14న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తున్నట్లు వివరించారు.

తాగునీటి బోరు ఏర్పాటు



ఏర్పేడు:మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో బుధవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి నివేదించడంతో ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో కాలనీలో బోరు వేశారు.

హరో హర



భక్తులకు తాగునీటిని ఇస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్



ఇంద్ర విమానంపై విహరిస్తున్న కుమారస్వామి

- భక్తులతో పోటెత్తిన విజ్ఞానగిరి
- కావడి మొక్కులు చెల్లింపు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వర అనుబంధ కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలలో బుధవారం ఆడికృత్తికకు భక్తులు పోటెత్తారు. కావడి మొక్కులు చెల్లించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులలతో ఆ ప్రాంతం హరోం హర నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెండు మార్గాలు ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో తొక్కిసలాటలు జరగకుండా పటిష్టమైన క్యూలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సామాన్య భక్తులకు అగ్రపీఠం వేసి, వారికి స్వామివారి దర్శనం అయ్యేవరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకున్నామని అంజూరు చెప్పారు. అడ్డదారిలో ప్రవేశించే వారికి అడ్డుకట్ట వేశామని, క్యూల వద్ద పటిష్ట బందోబస్తు కారణంగా ఇది సాధ్యమైందని చెప్పారు.

నారద పుష్కరిణిలో తలనీలాల సమర్పణ

ఆడికృత్తికను పురస్కరించుకుని నారద పుష్కరిణిలో కల్యాణకట్ట ఏర్పాటు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు పలువురు అక్కడ తలనీలాలు సమర్పించి, అక్కడే స్నానఘట్టాల వద్ద పవిత్ర స్నానాలు ఆచరించారు.

ఇంద్ర విమానంపై కుమారస్వామి విహారం

ఉత్సవాలలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఇంద్ర విమానంపై పురవిహారం చేశారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించారు.

భక్తుల సేవలో..

ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు పలువురు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా దీనిని కొనసాగించారు. కార్తికేయ మిత్రబృందం ఏర్పాటు చేసిన ప్రసాదాల పంపిణీని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు ప్రారంభించారు. అలాగే, పట్టణంలోని జెడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, సరస్వతిబాయి ఉన్నత పాఠశాల, బాబు అగ్రహారం ఉన్నత పాఠశాల, భాస్కరపేట ఉన్నత పాఠశాలలకు చెందిన మొత్తం 150 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు విజ్ఞానగిరిలోని క్యూల వద్ద భక్తులకు సేవలందించారు. కార్యక్రమంలో స్కౌట్స్ రాష్ట్రమండలి మాజీ సభ్యులు టి.రమేష్‌బాబు, గైడ్ కెప్టెన్లు నిర్మల, సావిత్రి, సులోచన, మాస్టర్లు ఎస్‌కే అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, ధనుష్, వెంకటేష్, రోవర్లు మహేంద్ర, విద్యాసాగర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శక్తివేల్ మురుగన్ ఆలయంలో..

సత్యవేడు: శ్రీ వళ్లి దేవసేన సమేత శక్తివేల్ మురుగన్ ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా భక్తులు కావడి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

వాడవాడలా ఆడికృత్తిక

వరదయ్యపాళెం: మండలంలో ఆడికృత్తికను ఘనంగా నిర్వహించారు. వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక పురవీధుల్లో మయూర వాహనంపై సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఆడికృత్తికను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

నాగలాపురంలో..



భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

నాగలాపురం: స్థానిక బజారువీధిలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పుష్పాలంకారంతో తిరువీధి ఉత్సవం చేసి భక్తులకు దర్శనభాగ్యం ఇచ్చారు.

నెమలి వాహనంపై చెంగల్వరాయుని చిద్విలాసం

శ్రీవళ్లీ దేవసేన సమేత చెంగల్వరాయస్వామి బుధవారం రాత్రి నెమలి వాహనంపై పురవిహారం చేశారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమల స్వామి అమ్మవార్లను నెమలి వాహనంపై అధిష్టించారు. పురవీధుల్లో విహరిస్తున్న స్వామి అమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో బుధవారం రాత్రి ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా సుబ్రమణ్యస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి భక్తులకు విభూది, ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా ఆడికృత్తిక

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయాన్నే స్వామివారి విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు తలనీలాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగించారు.



విశేషాలంకరణలో సుబ్రమణ్యేశ్వర స్వామి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



దళవాయి అగ్రహారంలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని గంగమిట్ట, రెడ్డి, కుమ్మర, చాకలవీధి, నరసరాజు అగ్రహారం, పిల్లారి గుడి వీధుల్లో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడప వద్దకే పాలన తీసుకొచ్చి దేశంలోనే అత్యుత్తమ సీఎంగా చరిత్ర సృష్టించారన్నారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ బాలాజి రెడ్డి, ఏఎంసీ అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్, సచివాలయ కన్వీనర్ మునీశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యుడు శెల్వి, గృహసారథులు చెంచుకృష్ణయ్య, దయాళ్‌రెడ్డి, జయకుమార్, శివమ్మ, వార్డు మెంబర్ జగన్నాథం, కోఆప్షన్ మెంబర్ మస్తాని, నేతలు మణి, శేఖర్‌బాబు, మునికృష్ణయ్య, గోవిందస్వామి, ఎంపీ రవి, మాణిక్యం, పళణి, మునివేలు, కృష్ణయ్య, సర్పంచులు శేఖర్, సన్యాసయ్య, బాలజీ, శ్రీనివాసులు రెడ్డి, రవిరెడ్డి, రూబెన్, గోవిందస్వామి, ఎంపీటీసీ సభ్యుడు శరవణన్, బాలాజి, ఎంఈఓ రవి, డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గడప గడప నిధులతో తాగునీటి బోరు

సత్యవేడు: నరసరాజు అగ్రహారంలోని వాసు నాయుడు క్వార్టర్స్ సమీపంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. తొలివిడత నరసరాజు అగ్రహారంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు తాగు నీటి వసతి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్థానికులకు నీటి వసతి కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నాలుగు రోజుల్లో బోరు వసతిని మండల అధికారులు కల్పించారు. బుధవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి తాగునీటి బోరును ప్రారంభించారు. వీధుల్లో కొళాయిలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ బాలాజి, ఎంపీటీసీ షీలా, ఎంపీ రవి, జె.మణి, మునికృష్ణయ్య, రాబర్ట్, రమణయ్య, ఏఈలు ఎంఎం దేవిప్రసాద్, భాను, పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకుందాం

-ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పిచ్చాటూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల మరణాలు, ఇతర ప్రత్యేక పరిస్థితులు కారణంగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని అడవికొడియంబేడులో మాత్రం సర్పంచ్ పుష్పవతి హఠాన్మరణం చెందిన కారణంగా ఎన్నికలు జరుగుతున్నాయని, మరికొన్ని చోట్ల వార్డు మెంబర్లకు ఎన్నిక అనివార్యమైందన్నారు. రాజకీయ పార్టీలు బేషాజాలకు పోకుండా పార్టీ, కులమతాలకు అతీతంగా మానవతా దృక్పథంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

15న రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి: 15న స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్, ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధి ఏడు గంగమ్మల ఆలయం పక్కనే ఉన్న ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రంలో ఈ శిబిరం నిర్వహిస్తామని, యువత రక్తదానం చేయాలని కోరారు.

స్కిల్ హబ్ విద్యార్థులకు ఓ వరం

- పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: యువత విద్యతో పాటు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాన్ని పెంపొందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ హబ్ సెంటర్లు నియోజకవర్గ కేంద్రాల్లోనూ, పార్లమెంట్ నియోజకవర్గంలో స్కిల్ కాలేజీల్లో వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల స్కిల్‌హబ్ కేంద్రంలో ఇచ్చే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఉషాదేవి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు శ్రీసిటీలోని పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు లభిస్తుందన్నారు. జెడ్పీటీసీ పి. విజయలక్ష్మి, మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, పీఎస్‌డీఓ ఏపీఎస్‌ఎస్‌డీసీ శ్యాం మోహన్, సర్పంచ్ టి.జయ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయతను చాటుకుందాం



ఏర్పేడులో పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి సిబ్బంది



భీమునిచెరువులో..

నారాయణవనం: నాభూమి–నాదేశం నినాదంతో జాతీయ వాదాన్ని చాటుకోవాలని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని మండలంలో భీమునిచెరువులో బుధవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలను నాటారు. భీమునిచెరువు, తిరువట్యం, ఎరికంబట్టు, వెత్తలతడుకులో శిలాఫలకాలను ఆవిష్కరించి, మొక్కలు నాటారు. ఎంపీడీఓ గుణశేఖర్, సర్పంచ్‌లు మురుగేశం, నాగూరు, రామ్మూర్తి, సుబ్బలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించుకోవాలని మండల ఎంపీడీఓ సుబ్రమణ్యంరాజు పిలుపునిచ్చారు. కువ్వాకొల్లి, సంతవేలూరు, అంబూరు, మావిళ్లపాడు, మరదవాడ గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, ఏపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

ఏర్పేడు: బండారుపల్లెలో నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. అమృత్ సరోవర్ వద్ద ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు రంగవల్లులు వేసి జాతీయ జెండాకు వందనం, పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. శిలాఫలకం ఆవిష్కరించి మొక్కలు నాటారు.

లీగల్ విషయాల్లోకి రాజకీయాలొద్దు

శ్రీకాళహస్తి: స్థిరాస్తి కొనుగోలు విషయంలో పట్టణంలోని గోపాలకృష్ణాపురానికి చెందిన డేగా నాగభూషణమ్మతో ముందస్తుగా చేసుకున్న ఒప్పందం ప్రకారమే నగదు చెల్లింపులు చేశామని, తీరా వారి కుటుంబీకులు అడ్డం తిరగడం అన్యా యమని మాజీ కౌన్సిలర్, రియల్టర్ ఆర్కాడు ముత్తు తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న స్థిరాస్తి కొనుగోలు అంశాన్ని రాజకీయం చేసి లబ్ధిపొందాలని టీడీపీ, జనసేన పార్టీలు చూడడం బాధాకరమని నిరసన వ్యక్తం చేశారు. ముత్తు, ఆయన రియల్ వ్యాపార మిత్రులు సుబ్రహ్మణ్యంరెడ్డి, కంచి గురవయ్య బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. నాగభూషణమ్మ వద్ద కొనుగోలు చేసిన ఆస్తిపై జనసేన, టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఆపాదించాలని చూడడం అవివేకమన్నారు. స్థిరాస్తి మొత్తానికి రూ.1.80కోట్లు చెల్లించాల్సి ఉండగా తాము మూడు దఫాల్లో రూ.50లక్షలు చెల్లించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు రావాలని కోరుతుంటే నాగభూషణమ్మ, ఆమె అల్లుళ్లు కుంటి సాకులు చెబుతూ అడ్డం తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని నిలదీస్తే వారిపై దౌర్జన్యం చేస్తున్నారని, జనసేన వినుత, చంద్రబాబు, టీడీపీ సుధీర్‌రెడ్డి తమ రాజకీయ పబ్బం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఇకపై విషయంపై దుష్ప్రచారం చేస్తే వారిపై కూడా న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.